సాక్షి
వరంగల్
బుధవారం । 25 । జనవరి । 2023



సోలార్ యూనిట్ ఏర్పాటుతో...
సౌర విద్యుత్ ఉత్పత్తి చేసుకోవడం ద్వారా విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించుకోవచ్చని ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావు అన్నారు.
- 8లో▸



మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం
మహిళలకు అన్ని విధాలా చేయూతనిస్తూ వారి ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని మంత్రి దయాకర్‌రావు అన్నారు.
- 8లో▸

గరిష్టం/కనిష్టం
32.0°/17.0°

వాతావరణం
జిల్లాలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండతో వాతావరణం పొడిగా ఉంటుంది. రాత్రిపూట చలిగా ఉంటుంది.

ఊరూరా మిర్చి కేంద్రాలు

త్వరలోనే సెర్ప్ ఆధ్వర్యంలో కొనుగోళ్లు
- తేమశాతం ఆధారంగా ధర నిర్ణయం
- రైతుకు తప్పనున్న తిప్పలు

దుగ్గొండి మండలానికి చెందిన ప్రదీప్‌రెడ్డి తేజ రకం మిర్చి సాగు చేశాడు. దాదాపు 40 బస్తాల్ని అమ్మేందుకు ట్రాలీలో వరంగల్ ఏనుమాముల మార్కెట్‌కు తీసుకెళ్లేందుకు రూ.3 వేల నుంచి రూ.4వేలు ఖర్చు చేశాడు. దీంతోపాటు మార్కెట్‌లో ఖరీదుదారు కమీషన్, మార్కెట్ ఫీజు అన్నీ కలిపి 15 క్వింటాళ్లకు రూ.5లక్షలు వస్తే.. రూ.30వేలు అమ్మేందుకే ఖర్చయ్యింది. ఇకపై ప్రదీప్‌రెడ్డి లాంటి రైతులు మిర్చి అమ్మేందుకు వ్యయ ప్రయాసల కోర్చాల్సిన పని లేదు. త్వరలోనే ఊరూరా మిర్చి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. రవాణా, కమీషన్ తదితర ఖర్చులు రైతులకు ఆదా కానున్నాయి.

సాక్షి, వరంగల్: తేజ రకం మిర్చి రైతులకు అమ్మకాల తిప్పలు తప్పనున్నాయి. వరంగల్‌లోని ఏనుమాముల మార్కెట్‌కు ప్రైవేట్ వాహనాల్లో తీసుకొచ్చి రవాణా చార్జీలు చెల్లించి.. ఆ తర్వాత మార్కెట్‌లో కమిషన్ చార్జీలు, మార్కెట్ ఫీజు చెల్లించడంతోపాటు గంటలకొద్దీ ప్రయాసపడే పరిస్థితులు తొలగనున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్లాంట్ లిపిడ్ కంపెనీ ద్వారా చేసుకున్న ఒప్పందం ప్రకారం.. జిల్లా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో రైతుల తోటల వద్దే తేజ రకం మిర్చి కొనుగోళ్లు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. అక్షయ రైతు ఉత్పత్తిదారుల సంస్థ, ఉషోదయ రైతు ఉత్పత్తిదారుల కంపెనీ ఆధ్వర్యంలో జిల్లాలోని చెన్నారావుపేట, నెక్కొండ, దుగ్గొండి, నల్లబెల్లి, పర్వతగిరి, రాయపర్తి మండలాల్లోని 14 గ్రామాల్లో మిర్చి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. కాగా.. జిల్లాలో సుమారు ఐదు వేల ఎకరాల్లో తేజ మిర్చి రకం సాగు చేశారు. ప్రస్తుతం నల్లి, పేను బీడ పురుగు కారణంగా ఎకరాకు 15 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉంది. అంటే దాదాపు 75,000 క్వింటాళ్ల పంట రావొచ్చని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. కాగా.. ఇప్పటికే ఆయా మండలాల్లో సంబంధిత అధికారులు మిర్చి రైతులకు సదస్సులు ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు.


తప్పనున్న శ్రమ..

మిర్చి అమ్మేందుకు కిలోమీటర్లు దాటి వరంగల్‌లోని ఏనుమాముల మార్కెట్‌కు రావాలి. సరుకు రవాణా ఖర్చు, దారి ఖర్చులు రైతులు భరించేవారు. సరుకు అమ్మేందుకు వస్తుండగా, అమ్మి వెళ్తుండగా రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోయిన సందర్భాలూ ఉన్నాయి. దీనికి తోడు మార్కెట్‌లో ఎవరికి సరుకు అమ్మినా తరుగు పోతుందనే భయం రైతులను వెంటాడేది. అడ్తిదారు కమీషన్, ఇంకో వైపు మార్కెట్ ఫీజు చెల్లించాలి. ఊళ్లల్లో మిర్చి తోటల్లోనే మిర్చి కొనుగోళ్లతో రైతులకు ఇవన్నీ బాధలు తప్పనున్నాయి. రైతులకు లాభం కూడా జరగనుంది. వారే ఇంటి వద్దకు వచ్చి తేమశాతం ఆధారంగా మిర్చికి రేటు నిర్ణయిస్తారు. కొనుగోలు చేసిన ఏడు రోజుల్లోనే అన్నదాతల బ్యాంక్ ఖాతాలో డబ్బులు జమ అయ్యేలా చూస్తారు.

రైతుల వివరాలు తీసుకొని కొనుగోళ్లు..



“ధాన్యం కొనుగోలు కేంద్రాల మాదిరిగానే గ్రామాల్లోని రైతుల నుంచి తేజ రకం మిర్చి కొనుగోలు చేస్తారు. సెర్ప్ ఆధ్వర్యంలో గ్రామస్థాయి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి వాటి ద్వారా మిర్చి కొంటారు. రైతుల ఆధార్‌కార్డు, బ్యాంక్ పాస్‌బుక్ వివరాల ఆధారంగా వారి వివరాలను ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేస్తారు. వారి నుంచి ఎంత సరుకు కొనుగోలు చేశామనేది కూడా నిక్షిప్తం చేస్తారు. ఆ తర్వాత ఏడు రోజుల్లో డబ్బులు జమ అవుతాయి.
– గోపి, కలెక్టర్, వరంగల్

‘కొత్త’ సాయానికి కత్తెర



ఈ ఫొటోలోని రైతు బత్తిన మహేశ్‌ది నల్లబెల్లి మండలం రేలగుంట. గత వానాకాలం నుంచి రైతుబంధు రావట్లేదు. ఉమ్మడి కుటుంబంగా ఉన్న వీరికి 4 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. గతంలో ఈ భూమి తల్లి రమాదేవి పేరుపై పట్టా ఉండేది. దీనిని వారసత్వంగా ముగ్గురు కొడుకులకు తలో ఎకరం పట్టా చేయించింది. మిగతా ఎకరం తన పేర ఉంది. గతంలో 4 ఎకరాలకు రైతుబంధు వచ్చింది. రిజిస్ట్రేషన్ చేయించుకుని ఏడాది గడిచినా రెండు పంటలకు రైతుబంధు రాలేదు. పెట్టుబడికి ఇబ్బంది అవుతోందని, ప్రైవేట్ అప్పులు చేయాల్సివస్తోందని మహేశ్ ఆవేదన వ్యక్తం చేశాడు.

రైతుబంధుపై సాంకేతికత ఎఫెక్ట్
- ఉమ్మడి వరంగల్‌లో పలువురికి చుక్కెదురు
- కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న రైతులు
- 25,499 మంది రైతులకు సాయం దూరం

సాక్షిప్రతినిధి, వరంగల్: రైతుబంధు పెట్టుబడి సాయం గత నెల 28 నుంచి విడతలవారీగా విడుదల చేశారు. ఎకరం భూమి ఉన్న వారి నుంచి మొదలుపెట్టి రైతుబంధు పోర్టల్‌లో నమోదైన ప్రతి ఒక్కరికీ జమ చేశారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. వానాకాలం సీజన్‌కు ముందు తర్వాత భూముల క్రయ విక్రయాలు, యాజమాన్య హక్కుల బదిలీల్లో జరిగిన మార్పులు, వారసత్వ పట్టాల మార్పిడి చేసినా చాలామందికి యాసంగి సాయం అందలేదు. కొందరికి వానాకాలం, యాసంగి పంటలకు కూడా రైతుబంధు జమవక పోగా.. ఇప్పటికీ స్పష్టత కొరవడింది. కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు వచ్చిన రైతుల నుంచి దరఖాస్తులు తీసుకుంటున్నా పోర్టల్ మాత్రం తెరుచుకోలేదు. గడువు ముగుస్తున్నా.. నమోదు ప్రక్రియ ప్రాసెసింగ్‌లో ఉన్నట్లు చూపుతోంది. ఫలితంగా రైతులు ఆందోళన చెందుతున్నారు.

అందని ‘బంధు’
ఉమ్మడి వరంగల్ జిల్లాలో 8,62,654 మందికి 14,36,154 ఎకరాలకు సుమారు రూ.709కోట్ల మేరకు రైతుబంధు ఖాతాల్లో జమయినట్లు అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. ఈ మేరకు నిబంధనల ప్రకారం మరో 25,499 మందికి 30,349 ఎకరాలకు సాయం అందాల్సి ఉంది. గత సీజన్ నుంచి ఇప్పటివరకు క్రయవిక్రయాలు, వారసత్వంగా భూములు దక్కించుకున్న కొత్త రైతుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియ నిలిచిపోవడం వల్ల డబ్బులు జమ కాలేదని అధికారులు చెబుతున్నారు. పెట్టుబడి సాయం పంపిణీకి ప్రభుత్వం ప్రత్యేకంగా రైతుబంధు పోర్టల్ రూపొందించిన నేపథ్యంలో రెవెన్యూ అధికారులు ఇచ్చిన సమాచారాన్ని నేరుగా నిక్షిప్తం చేసి ఆ మేరకు రైతుల ఖాతాల్లో నగదు జమ చేసినట్లుగా చెబుతున్నారు. గత వానాకాలం, ఈ యాసంగికి కూడా కొత్త రైతులు అర్హులు కాలేదు. దీనిపై సాంకేతిక కారణాలను చూపుతుండగా.. వ్యవసాయ శాఖ అధికారులు మాత్రం భూములున్న అందరు రైతుల వివరాలు ఆన్‌లైన్ చేశామని చెబుతున్నారు.

న్యూస్‌రీల్

లక్ష్య సాధనకు కృషి చేయాలి



గీసుకొండ: బాలికలు తాము తక్కువనే ఆత్మన్యూనతా భావాన్ని వీడి అనుకున్న లక్ష్యాల సాధనకు కృషి చేసి జీవితంలో రాణించాలని డీఈఓ డి.వాసంతి అన్నారు. మంగళవారం వంచనగిరి కేజీబీవీలో జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ఆమె మాట్లాడారు. విద్యార్థినులు పాఠశాల స్థాయి నుంచే ఆత్మరక్షణ మెళకువలు నేర్చుకుని తమను తాము రక్షించుకోవాలన్నారు. జిల్లా సెక్టోరియల్ అధికారి కె.సుభాష్ మాట్లాడుతూ సమాజంలో స్త్రీ, పురుషులు సమానమే అని, వివక్షను ఎదుర్కొని అన్ని రంగాల్లో ఎదగాలన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ హిమబిందు, సర్పంచ్ అమిరిశెట్టి అనసూయ, మార్షల్ ఆర్ట్స్ ఇన్‌స్ట్రక్టర్ శ్రీనివాస్, గ్రామ పెద్దలు అమిరిశెట్టి రాజు, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు పలు విన్యాసాలు ప్రదర్శించారు.

2న ‘చిత్తడి నేలల’పై ప్రతిభా పోటీలు

ఖానాపురం: ఫిబ్రవరి 2న ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించనున్నట్లు ఓరుగల్లు వైల్డ్‌లైఫ్ సొసైటీ అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శి శ్యాంసుందర్ మంగళవారం తెలిపారు. చిత్తడి నేలలు–జీవవైవిధ్యంపై చిత్రలేఖన పోటీలు ఉదయం 10 నుంచి 11 గంటల వరకు, చిత్తడి నేలలు–ఆవశ్యకతపై 11.15 నుంచి 12 గంటల వరకు జిల్లాలోని ప్రతీ ప్రభుత్వ పాఠశాలలో ఓరుగల్లు వైల్డ్‌లైఫ్ సొసైటీ ఆధ్వర్యంలో చేపట్టనున్నట్లు తెలిపారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులు పోటీల్లో పాల్గొనాలని, ఇతర వివరాలకు 99633 38116, 99855 49900 నంబర్లలో సంప్రదించాలని వారు కోరారు.

ఇద్దరు ఎంపీడీఓలకు పోస్టింగ్‌లు



ప్రవీణ్‌కుమార్, భారతి

వరంగల్ రూరల్: జిల్లాలోని గీసుకొండ, చెన్నారావుపేట ఎంపీడీఓలుగా వి.ప్రవీణ్‌కుమార్, ఈ.భారతికి జెడ్పీ సీఈఓ సాహితీ మిత్ర మంగళవారం పోస్టింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. గీసుకొండ మండల పరిషత్‌లో సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న ప్రవీణ్‌కుమార్‌కు తాత్కాలిక బాధ్యతలు అప్పగించగా.. మంగళవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లెలో ఎంపీడీఓగా పనిచేస్తున్న భారతిని బదిలీ చేయడంతో ఆమె మంగళవా రం చెన్నారావుపేటలో బాధ్యతలు చేపట్టారు.

నేడు సర్వీస్ బుక్, సర్టిఫికెట్ల పరిశీలన

కాశిబుగ్గ సెంటర్: ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియలో భాగంగా జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్ పాఠశాలల్లోని స్కూల్ అసిస్టెంట్లు, ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులు బుధవారం ఉదయం 10.30 గంటలకు సర్వీస్ బుక్, ఒరిజినల్ సర్టిఫికెట్లతో పరిశీలనకు హాజరు కావాలని డీఈఓ వాసంతి ఒక ప్రకటనలో తెలిపారు.

జీపీ యూనియన్ జిల్లా కార్యవర్గం



నర్సంపేట: గ్రామపంచాయతీ ఉద్యోగుల సంఘం(టీఆర్ఎస్‌కేవీ అనుబంధ) జిల్లా కమిటీని నర్సంపేట పట్టణంలో మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా గౌరవఅధ్యక్షుడిగా గోనె యువరాజు, అధ్యక్షుడిగా కంజర్ల భాస్కర్, ప్రధాన కార్యదర్శిగా జన్ను శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా కాసు యాకన్న, పొన్నం రమేష్, ఎండి.పాషా, ముప్పిడి రమేష్, ఎండి.అలీ, కార్యదర్శిగా వెంకటేశ్వర్లు, నల్ల మహేందర్, వి.కుమారస్వామి, భూక్య రవీందర్, సభ్యులుగా కె.సురేష్, గుండె యాకయ్య ఎన్నికయ్యారు.

జీపీ భవనాల నిర్మాణానికి ప్రతిపాదనలు

వరంగల్ రూరల్: ఉపాధిహామీ నిధులతో జిల్లాలోని గ్రామ పంచాయతీ భవన నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేసి కలెక్టర్‌కు అందించినట్లు పీఆర్ ఈఈ గూడెం శంకరయ్య మంగళవారం తెలిపారు. 120 భవనాలకు ఒక్కోదానికి రూ.20లక్షల చొప్పున ప్రతిపాదనలు రూపొందించామని పేర్కొన్నారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పర్వతగిరి: ఐకేపీ, వీఓఏలు చురుకుగా పనిచేయడంతోపాటు ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి విస్తృతంగా ప్రచారం చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. తెలంగాణ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ అనుబంధ ఐకేపీ, వీఓఏ ఉద్యోగుల సంఘం రూపొందించిన 2023 క్యాలెండర్‌ను మంగళవారం పర్వతగిరిలోని తన నివాసంలో మంత్రి ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్మిక విభాగం గౌరవ అధ్యక్షుడు రూప్‌సింగ్, సంఘం అధ్యక్షురాలు మాధవి, ప్రధాన కార్యదర్శి మచ్చేందర్, కోశాధికారి తిరుపతి, సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మంత్రి దయాకర్‌రావు

చదువుతోనే ఉన్నత శిఖరాలకు..

- అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ

కరీమాబాద్: బాలికలు చిన్నతనం నుంచే పట్టుదలతో చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని, దీనికి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల ప్రోత్సాహం ఎంతో అవసరమని అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా మంగళవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలో ఆడపిల్లల పట్ల చూపుతున్న వివక్షను రూపుమాపాలని, అసమానతలను పారదోలాలని సూచించారు. బాలికలు అన్ని రంగాల్లో రాణిస్తున్నా.. వారికి మరిన్ని అవకాశాలు కల్పించినట్లయితే ముందంజలో ఉంటారన్నారు. బాలికలు ధైర్యంగా ఉంటే ఎలాంటి సమస్యలనైనా ఎదుర్కొనవచ్చన్నారు. జిల్లా సంక్షేమాధికారి ఎం.శారద మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో బాలికలకు ప్రత్యేకంగా ‘బేటీ బచావో–బేటీ పడావో’ పథకం, రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లాంటి పథకాలు అమలు చేస్తూ బాలికల భవిష్యత్‌కు భరోసా ఇస్తున్నట్లు తెలిపారు. కాగా.. కేజీబీవీ గీసుగొండ, పర్వతగిరి మోడల్ స్కూల్, నర్సంపేట సంజీవని ఆశ్రమంలో విద్యార్థినులకు ఆటల పోటీలు నిర్వహించగా.. విజేతలకు బహుమతులు, ప్రశంసపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ వసుధ, సభ్యులు రామలీల, మధు, షహేదాబేగం, సుజాత, సీనియర్ అసిస్టెంట్ కుమార్, జూనియర్ అసిస్టెంట్ ప్రవీణ్, సీడీపీఓ విశ్వజ, ఏసీడీపీఓలు వింధ్య, హేమలత, భరోసా సీఐ స్వర్ణలత, ప్రొటెక్షన్ అధికారులు రాజు, సరిత, సురేష్, సాగరిక, శ్రీలత, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, టీచర్లు పాల్గొన్నారు.


జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అశ్విని తానాజీ

చిరుధాన్యాల సాగుతో లాభాలు

సంగెం: చిరుధాన్యాల పంటలు సాగు చేసి రైతులు ఆర్థికంగా ఎదగాలని జిల్లా వ్యవసాయాధికారి ఉషాదయాళ్ అన్నారు. జాతీయ ఆహార భద్రత మిషన్ నిర్వహిస్తున్న అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం–2023 సందర్భంగా కాపులకనిపర్తి గ్రామంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం ప్రజలకు అవసరమైన చిరుధాన్యాల సాగుకు రైతులు ముందుకు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నేటితరం ప్రజలు సంపూర్ణ ఆరోగ్యం కోసం తమ ఆహారపు అలవాట్లను మార్చుకుని జొన్నలు, రాగులు, సజ్జలు, కొర్రలు, ఊదలు, అరికెలు వంటి చిరుధాన్యాల వైపునకు మొగ్గు చూపుతున్నారన్నారు. వారి అవసరాలకు అనుగుణంగా చిరుధాన్యాలు సాగు చేసి తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు ఆర్జించవచ్చన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ఆర్.ఉమారెడ్డి, నర్సయ్య, ఏడీఏ సురేష్‌కుమార్, ఎంపీపీ కళావతి, జెడ్పీటీసీ సుదర్శన్‌రెడ్డి, శాంతి సర్వీస్ సొసైటీ కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, ఏఓ యాకయ్య, ఏఈఓలు గీత, సాగర్, సమత, భారతి, రైతులు పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న జేడీఏ ఉషాదయాళ్, అధికారులు

విద్యను ఆయుధంగా చేసుకోవాలి

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఉపేందర్‌రావు

సంగెం: బాలికలు విద్యను ఆయుధంగా చేసుకుని భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జె.ఉపేందర్‌రావు సూచించారు. జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని సంగెంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ఆడపిల్ల అంటేనే ఒక సమస్యగా భావించడం, కించపరిచేలా చిన్నచూపు చూడడం దుర్మార్గంగా మారిందన్నారు. ఆడపిల్లల విద్య, పోషకాహారం చట్టబద్ధమైన హక్కులన్నారు. కేజీబీవీ ప్రత్యేకాధికారి నీలిమ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఉపేందర్‌రావు

కలెక్టరేట్ ఆవరణలోనే గణతంత్ర వేడుకలు

- ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ గోపి ఆదేశం

కరీమాబాద్: వరంగల్ జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించనున్న గణతంత్ర వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ గోపి అధికారులను ఆదేశించారు. ఈనెల 26న జరగనున్న రిపబ్లిక్ డే వేడుకలను కలెక్టరేట్‌లోనే నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో మంగళవారం ఆయన కార్యాలయ ప్రాంగణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆవరణలోని అనువైన ప్రదేశంలో స్టేజీ ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యార్థినీ విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, విధి నిర్వహణతోపాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో ఉత్తమ సేవలందించిన వారికి ప్రశంసపత్రాలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. వేడుకల నిర్వహణలో ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలని ఆయన స్పష్టం చేశారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ మహేందర్‌జీ, ఏఓ శ్రీకాంత్, వివిధ శాఖల సూపరింటెండెంట్లు ఉన్నారు.


కలెక్టరేట్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ గోపి

‘నాబార్డు’ కృషి అభినందనీయం
రైతు సంఘాల ఏర్పాటులో నాబార్డు కృషి అభినందనీయమని కలెక్టర్ గోపి అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం ముంబాయి నుంచి వచ్చిన నాబార్డు ప్రత్యేక బృందం సభ్యులతో కలెక్టర్ సమావేశమయ్యారు. జిల్లాలో నాబార్డు క్లస్టర్ కార్యాలయం సేవల గురించి సభ్యులు, అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ రచన పాటిల్, డాక్టర్ పల్లె మృణాల్ కలెక్టర్ గోపిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో రైతులకు, మహిళా సంఘాలకు సేవలందిస్తూ మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, డీడీఎం చంద్రశేఖర్, రవి పాల్గొన్నారు.

కంటివెలుగు శిబిరం పరిశీలన


శిబిరాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీవత్స

గీసుకొండ: గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ మొగిలిచర్ల జెడ్పీ పాఠశాలలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు పరీక్ష శిబిరాన్ని అదనపు కలెక్టర్ కోట శ్రీవత్స మంగళవారం పరిశీలించారు. పరీక్షల తీరును వైద్యులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కాగా.. జెడ్పీ పాఠశాలలో ఏర్పాటు చేసిన శిబిరం అసౌకర్యంగా ఉందని, ఒకే గది, వరండా కేటాయించారని, మెట్లు ఎత్తుగా ఉన్నాయని, 26న గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు ఆవరణలో ఆటల పోటీలు నిర్వహిస్తుండటంతో ఇబ్బందికరంగా ఉందని వైద్యులు, సిబ్బంది ఆయన దృష్టికి తెచ్చారు. ఆయన వెంట మండల స్పెషల్ ఆఫీసర్ మురళీధర్‌రెడ్డి, మున్సిపల్ ఎండ మాలజిస్టు స్పెషల్ ఆఫీసర్ మాధవరెడ్డి ఉన్నారు. అంతకుముందు స్పెషల్ ఆఫీసర్ మురళీధర్‌రెడ్డి గీసుకొండలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని పరిశీలించారు. మొగిలిచర్ల వైద్యాధికారి జి.పల్లవి, సీహెచ్‌ఓ బి.మధుసూదన్‌రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

‘కంటి పరీక్షలు చేయించుకోవాలి’
నెక్కొండ: 18 ఏళ్ల పైబడిన ప్రతి ఒక్కరు కంటి పరీక్షలు చేయించుకోవాలని జిల్లా ప్రోగ్రాం అధికారి మధుసూదన్ అన్నారు. అలంకానిపేట పీహెచ్‌సీలో కొనసాగుతున్న కంటి వెలుగు శిబిరాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ మాదాసు అనంతలక్ష్మి, పీహెచ్‌సీ వైద్యాధికారి అరుణ్‌కుమార్, కంటి వెలుగు వైద్యాధికారి జైపాల్‌రెడ్డి, ఆప్తాలమిక్ అనిల్, సూపర్‌వైజర్ రాజు, అరుణకుమారి, సుజాత పాల్గొన్నారు.

కార్పొరేట్ సంస్థలకు ప్రభుత్వాల పెద్దపీట
మూల్యాంకనం చేసే అవకాశం ఇవ్వాలి
పరీక్షల నిర్వహణ తీరు పరిశీలన
కాంట్రాక్ట్ అధ్యాపకుల సమ్మె నోటీస్
- వివరాలు 10లో▸

రైతు వ్యతిరేక విధానాలపై పోరాటాలు

- ఏఐపీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాయల చంద్రశేఖర్

నెక్కొండ: రైతు వ్యతిరేక సంస్కరణలకు వ్యతిరేకంగా రైతులంతా ఏకమై పోరాటాలు చేయాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ రైతు సంఘం (ఏఐపీకేఎస్) రాష్ట్ర అధ్యక్షుడు రాయల చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. నెక్కొండ వ్యవసాయ మార్కెట్ ఆవరణలో మంగళవారం ఆ సంఘం జిల్లా కౌన్సిల్ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ దేశానికి వెన్నుముక అయిన వ్యవసాయ రంగాన్ని, రైతాంగాన్ని అభివృద్ధి పర్చడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తి విఫలమయ్యాయన్నారు. ప్రభుత్వాల వ్యతిరేక విధానాలకు తోడు సరైన గిట్టుబాటు ధర అందక, నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులతో రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశానికి ముందు సంఘం జెండాను ఆయన ఆవిష్కరించారు. రైతాంగ ఉద్యమంలో అమరులైన వీరులను స్మరిస్తూ నివాళులర్పించారు.

జిల్లా నూతన కార్యవర్గం
కాగా.. సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కోడెం సారంగం, ఉపాధ్యక్షుడిగా బొట్ల రాకేష్, ప్రధాన కార్యదర్శిగా చిర్ర సూరి, సహాయ కార్యదర్శిగా చొప్పరి నర్సింహస్వామి, కోశాధికారిగా మైదం పాణి, సభ్యులుగా అశోక్, రమేష్, వీరన్న, కొమురన్న, బిచ్చా, సారయ్య, వెంకన్న, లింగన్న ఎన్నికయ్యా రు. అనంతరం కౌన్సిల్ సమావేశంలో ప్రవేశపెట్టిన పలు తీర్మానాలను ఆమోదించారు. సమావేశంలో సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి చంద్రన్న, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు కొత్తపెల్లి రవి, పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు బి.నర్సింహారావు, రైతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాయల చంద్రశేఖర్

వనదర్శినితో విజ్ఞానం

ఖానాపురం: వనదర్శిని కార్యక్రమంతో విద్యార్థులకు అడవులపై అవగాహన పెరుగుతుందని, మొక్కల ప్రాధాన్యం తెలుస్తుందని ఎఫ్ఆర్వోలు బల్లిడి రమేష్, సదానందం అన్నారు. మండలంలోని పాకాలలో అటవీ శాఖ ఆధ్వర్యంలో వంచనగిరి మోడల్ స్కూల్, ధర్మారం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మంగళవారం వనదర్శిని కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బటర్ ఫ్లై గార్డెన్, అటవీ ప్రాంతాల్లో ఉండే మొక్కలపై అవగాహన కల్పించారు. పాకాల విశిష్టత, చరిత్రపై వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ మొక్కల పెంపకం వల్ల కలిగే లాభాలు, ఉపయోగాల గురించి విద్యార్థులు తమ కుటుంబ సభ్యులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో మోహన్, ఎఫ్‌డీఓ ఖలీల్, బౌల్స్ బాధ్యులు నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న ఎఫ్ఆర్వో రమేష్

‘పల్లె’ను సందర్శించిన బ్యాంకు అధికారులు

గీసుకొండ: జాతీయ ఆదర్శ గ్రామం గంగదేవిపల్లిని యూనియన్ బ్యాంకు అధికారులు మంగళవారం సందర్శించారు. గ్రామం అభివృద్ధి తీరుతెన్నులను పరిశీలించారు. గతంలోనే ఈ బ్యాంకు వారు గ్రామాన్ని దత్తత తీసుకోగా.. బ్యాంకు జనరల్ మేనేజర్(ముంబాయి సెంటర్ ఆఫీస్) పంకజ్‌కుమార్, వరంగల్ రీజినల్ హెడ్ పలుగుల సత్యం, డిప్యూటీ రీజినల్ హెడ్ వజీర్ సుల్తాన్, గీసుకొండ బ్రాంచి మేనేజర్ రణధీర్, పలువురు బ్యాంకు అధికారులు సందర్శించగా.. సర్పంచ్ గోనె మల్లారెడ్డి వారికి గ్రామం గురించి వివరించారు.


జీపీ వద్ద బ్యాంకు అధికారులు

విద్యుదాఘాతంతో వివాహిత మృతి

నెల్లికుదురు: విద్యుదాఘాతంతో వివాహిత మృతి చెందింది. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం సొల్లతండా శివారు శనిగకుంట తండాలో మంగళవారం ఈ ఘటన చోటు చేసుకుంది. తండాకు చెందిన గుగులోత్ మంజుల(28) ఇంటి ముందు శుభ్రం చేసేందుకు రేకులపై ఉన్న చీపురు కట్టను తీసే ప్రయత్నం చేసింది. అయితే, రేకుల పైనుంచి ఇంట్లోకి వెళ్లిన సర్వీస్ వైరు తెగిపోయి రేకులకు తాకడంతో విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి భర్త వెంకన్న ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జితేందర్ తెలిపారు.

కలప ట్రాక్టర్ బోల్తా



వర్ధన్నపేట: కలప ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో డ్రైవర్ తృటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం కట్ర్యాల గ్రామ శివారులో రాయపర్తి మండలం ఊకల్లు గ్రామం నుంచి కలప లోడుతో వరంగల్‌కు వెళ్తున్న ట్రాక్టర్ మంగళవారం తెల్లవారుజామున అదుపుతప్పి బోల్తా పడింది. ఈ క్రమంలో డ్రైవర్ అప్రమత్తమై కిందకు దూకడంతో ప్రాణాపాయం తప్పి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

సీసీఐ రాష్ట్ర అధ్యక్షుడిగా మొగిలిచెర్ల సుదర్శన్



ఖిలా వరంగల్: వినియోగదారుల సమాఖ్య ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు, సీసీసీ(కన్స్యూమర్ కోఆర్డినేషన్ కౌన్సిల్) సౌత్ స్టేట్ ఉపాధ్యక్షుడు, వినియోగదారుల జాతీయ అపెక్స్ కమిటీ సీసీఐ(కన్స్యూమర్ కాన్ఫిడరేషన్ ఆఫ్ ఇండియా) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా శివనగర్‌కు చెందిన మొగిలిచెర్ల సుదర్శన్ నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం సీసీఐ జాతీయ బాధ్యులు డాక్టర్ అనంత శర్మ, డాక్టర్ అరుణ్‌కుమార్, దేవేంద్రి తివారి, ప్రీతి పాండ్యా, విజేంద్రప్రకాశ్ హాల్‌చల్, కైలాష్ కమౌత్ బృందం నియామక ఉత్తర్వులు జారీ చేసింది. బాధ్యతలు చేపట్టిన తర్వాత రాష్ట్ర గవర్నర్‌ను కలిసి వినియోగదారుల చట్టాల్లోని లోపాలను సవరించాలని కోరుతానని సుదర్శన్ ఈ సందర్భంగా తెలిపారు. నియామకానికి సహకరించిన జాతీయ, రాష్ట్ర కమిటీలు, సహ ఉద్యమకారులు సాంబరాజు చక్రపాణి, పల్లేపాడు దామోదర్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- కొడకండ్లలో కుట్టు శిక్షణ ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దయాకర్‌రావు

కొడకండ్ల: మహిళలకు అన్ని విధాలుగా చేయూతనిస్తూ వారి ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. జనగామ జిల్లా కొడకండ్ల మండల కేంద్రంలోని శ్రీవెంకటేశ్వర మండల సమాఖ్యలో మహిళలకు డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ కేంద్రాన్ని మంత్రి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ రాష్ట్రంలోనే ప్రథమంగా కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని పాలకుర్తిలో ప్రారంభించామని తెలిపారు. రూ.5 కోట్లతో 3 వేల మంది మహిళలకు 45 రోజులపాటు శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. ట్రెనింగ్ పూర్తయిన తర్వాత పాఠశాలలు, వసతి గృహాల విద్యార్థులకందించే దుస్తులు కుట్టే బాధ్యత అప్పగిస్తామని, అలాగే అర్హత కలిగిన వారికి టెక్స్‌టైల్ పార్క్‌లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్రమంతా విస్తరిస్తామని అన్నారు. ఏ రాష్ట్రంలో ఇవ్వని విధంగా మహిళలకు అత్యధికంగా రుణాలందించామని, మహిళలు ఆర్థికంగా ఎదిగితేనే ఆ కుటుంబం బాగుందని తెలిపారు. అందివచ్చిన అవకాశాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం శ్రీనిధి రుణం ద్వారా సోలార్ పథకాన్ని ప్రారంభించారు. బాలికల దినోత్సవం సందర్భంగా మంత్రి బాలికలకు మిఠాయిలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రైతువేదికలోని కంటి వెలుగు శిబిరాన్ని సందర్శించి నిర్వహణ, కంటి పరీక్షలను పరిశీలించడంతోపాటు ప్రజలతో మాట్లాడారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫూల్‌దేశాయ్, డీఆర్‌డీఓ రాంరెడ్డి, డీసీసీబీ వైస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీపీ జ్యోతి, మార్కెట్ చైర్మన్ రాము, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు సిందె రామోజీ, సర్పంచ్, ఎంపీటీసీలు మదుసూధన్, విజయలక్ష్మీ, నసీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌టీపీని బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న గట్టు రాంచందర్‌రావు

నయీంనగర్: వైఎస్సార్ తెలంగాణ పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయాలని పార్టీ రాజకీయ కార్యాచరణ కమిటీ సభ్యుడు గట్టు రామచందర్‌రావు పిలుపునిచ్చారు. మంగళవారం హనుమకొండలోని వైఎస్సార్‌టీపీ కార్యాలయంలో వరంగల్, హనుమకొండ జిల్లాల అధ్యక్షుడు నాడెం శాంతికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లా నాయకుల విస్తృత స్థాయి సమావేశంలో రామచందర్‌రావు మాట్లాడారు. తెలంగాణలో బీఆర్‌ఎస్ పార్టీకి ప్రత్యామ్నాయం వైఎస్సాఆర్‌టీపీ మాత్రమేనన్నారు. రాష్ట్ర అధికార ప్రతినిధి పిట్ట రాంరెడ్డి మాట్లాడుతూ త్వరలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో జరగనున్న వైఎస్ షర్మిల ప్రజాప్రస్థానం పాదయాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర కార్యాచరణ సభ్యులు ఏపూరి సోమన్న, నీలం రమేష్, గడిపెల్లి కవిత మాట్లాడుతూ వైఎస్సార్ తెలంగాణ పార్టీకి దివంగత మహానేత డా.వైఎస్ఆర్ పథకాలే ప్రచార అస్త్రాలని, ప్రజా సమస్యలపై నిత్యం పోరాడితేనే ప్రజల్లో పార్టీకి, నాయకులకు గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో బీరవెల్లి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి చల్లా అమరేందర్‌రెడ్డి, మారం రెడ్డి కొటిల్‌రెడ్డి, అప్పం కిషన్, రామసహాయం శ్రీనివాస్‌రెడ్డి, మల్లేశంగౌడ్, సుమిత్‌గుప్త, రాబర్ట్, సమ్మయ్య, రాములునాయక్, వెంకట్‌రెడ్డి, స్వామి, వినోద్ కుమార్, రఘు, శోభ, పృధ్వీ తదితరులు పాల్గొన్నారు.

బ్రెడ్ తయారీ కేంద్రం సీజ్



అభిరుచి మిల్క్ బ్రెడ్ తయారీ కేంద్రంలో తనిఖీలు చేస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

వరంగల్ అర్బన్: వరంగల్ ఏనుమాముల మార్కెట్ సమీపంలో ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్ లేకుండా నిర్వహిస్తున్న అభిరుచి మిల్క్ బ్రెడ్ తయారీ కేంద్రంలో టాస్క్‌ఫోర్స్ అధికారులు, సిబ్బంది మంగళవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. బ్రాండ్ పేరుతో కొలతలు లేకుండా, ఫార్మాలిన్ రసాయనం ఉపయోగిస్తూ బ్రెడ్, ఇతర ఉత్పత్తులు తయారు చేస్తున్నట్లు గుర్తించారు. బ్రెడ్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని నిర్వాహకుడైన హనుమకొండ లక్ష్మీపురానికి చెందిన అడ్లూరి జనార్దన్‌కు రూ.20వేల జరిమానా విధించారు. అలాగే, తయారీ కేంద్రాన్ని సీజ్ చేశారు. తనిఖీల్లో అడిషనల్ డీసీపీ రఘునాథ్ గైక్వాడ్, ఏసీపీ జితేందర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ ఎ.వెంకటేశ్వర్లు, ఎస్సై లవన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

అత్యాచారం కేసులో యావజ్జీవ శిక్ష

రఘునాథపల్లి: లిఫ్ట్ ఇస్తానంటూ వృద్ధురాలిని ద్విచక్రవాహనంపై తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడిన వ్యక్తికి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ జనగామ జిల్లా కోర్టు న్యాయమూర్తి కె.శైలజ తీర్పు వెలువరించారు. ఎస్సై వీరేందర్ కథనం ప్రకారం.. జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం కోమళ్ల గ్రామానికి చెందిన ఎండి అక్బర్ 2017లో అదే గ్రామానికి చెందిన వృద్ధురాలికి బస్టాండ్ నుంచి లిఫ్ట్ ఇస్తానని నమ్మబలికి బైక్‌పై నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పలుమార్లు కోర్టులో వాదనలు జరిగాయి. నేరం రుజువు కావడంతో నిందితుడికి యావజ్జీవ శిక్ష విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు.

చోరీ కేసు.. పోలీసుల అదుపులో ముగ్గురు

కురవి: మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రంలో ఇటీవల మూడు ఇళ్లల్లో చోరీ జరిగిన ఘటనలో కురవికి చెందిన ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈనెల 20న 'మూడు ఇళ్లల్లో చోరీ' అనే కథనం సాక్షిలో ప్రచురితమైంది. స్పందించిన పోలీసులు అదే కాలనీతోపాటు పక్క కాలనీకి చెందిన ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కాగా, దొంగతనంలో ముగ్గురితోపాటు మరికొందరి హస్తం ఉన్నట్లు సమాచారం. పోలీసుల అదుపులో ఉన్న వారిలో మైనర్లు ఉన్నట్లు తెలుస్తోంది. ఇదే విషయమై ఎస్సై బి.రామునాయక్‌ను వివరణ కోరగా విచారణ కొనసాగుతోందని, రెండు రోజుల్లో కేసును చేధిస్తామని తెలిపారు.

31న కమలాపూర్‌కు మంత్రి కేటీఆర్

- పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు
- ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్, ఎమ్మెల్సీ



ఎంజేపీ గురుకుల పాఠశాల ఆవరణలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్సీ

కమలాపూర్: రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ఈ నెల 31న కమలాపూర్‌లో పర్యటించనున్నట్లు హనుమకొండ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం కమలాపూర్‌లో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి కేటీఆర్ కమలాపూర్‌లో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తారని తెలిపారు. ముఖ్యంగా మహాత్మ జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాలల నూతన భవనాలను, కుల సంఘ భవనాలు, కేజీబీవీ జూనియర్ కళాశాల, ప్రభుత్వ కళాశాల భవనాలను ప్రారంభించి బస్టాండ్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారని పేర్కొన్నారు. ఈ మేరకు పాఠశాలల ఆవరణలో సుందరీకరణ పనులతో పాటు మొక్కలు నాటాలని అధికారులకు సూచించారు. మంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. బందోబస్తు, కాన్వాయ్, హెలిపాడ్ ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ బండ శ్రీనివాస్, డీఆర్వో వాసుచంద్ర, బీసీ సంక్షేమశాఖ అధికారి రాంరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సంపత్‌రావు, డైరెక్టర్ సత్యనారాయణరావు, కేడీసీసీబీ డైరెక్టర్ కృష్ణప్రసాద్, తహసీల్దార్ రాణి, ఎంపీడీఓ పల్లవి, బీఆర్ఎస్ నాయకులు ప్రదీప్‌రెడ్డి, దశరథం, తిరుపతిరెడ్డి, అశోక్, రవి, మల్లారెడ్డి, మురళి తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ ఆర్టీఏలో అన్నీ సమస్యలే..

- అధికారులను నిలదీసిన వాహనదారులు



వరంగల్ ఆర్టీఏలో అధికారులను నిలదీస్తున్న వాహనదారులు

ఖిలా వరంగల్: వరంగల్ ఆర్టీఏ కార్యాలయంలో అన్నీ సమస్యలే కనిస్తున్నాయి. హోంగార్డుల మొదలు అధికారుల వరకూ ఇష్టారాజ్యమే. ఏదైనా సమస్య వస్తే మాపై అధికారిని కలవండి.. అధికారిని కలిస్తే ఆపై అధికారిని కలవాలంటూ సమాధానం చెప్పడమే తప్పా సమస్య పరిష్కారం కావడం లేదు. సమస్య చిన్నదైనా చేయి తడపనిదే పని జరిగే పరిస్థితి లేదు. పేరుకే అవినీతి రహిత సేవలు కానీ దొడ్డి దారిలో అన్ని నడుస్తున్నాయి. ఆర్టీఓ ఉన్నట్లే కానీ ఎవరూ కలువలేరూ.. సమస్య చెబుకునేందుకు సమయమూ ఇవ్వరు. దీంతో వాహనదారులు ఆర్టీఏ కార్యాలయం చుట్టూ తిరగలేక సహనం కోల్పోయి మంగళవారం అధికారులను నిలదీశారు. తానేమీ చేయలేను ఆర్టీఓను కలవండి అంటూ సమాధానం చెప్పడంతో వాహనదారులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో సేవలు కాసేపు నిలిచిపోయాయి. ఆ తర్వాత అధికారుల జోక్యంతో కార్యకలాపాలు యధావిధిగా జరిగాయి. కాగా, కార్డులు పోస్ట్ చేయడం లేదని, ట్రాఫిక్ పోలీసులు కార్డు లేకపోతే వాహనం సీజ్ చేస్తున్నారని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఆర్టీఓ స్థాయి అధికారి స్పందించి సమస్యలు పరిష్కారించాలని వాహనదారులు కోరుతున్నారు.

మావోయిస్టు సానుభూతిపరుడి అరెస్ట్

- జిలెటిన్ స్టిక్స్, డిటోనేటర్స్ విప్లవసాహిత్యం స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ, సీఐ



స్వాధీనం చేసుకున్న విప్లవ సాహిత్యం, పేలుడు సామగ్రి

కాటారం: గతంలో నిషేధిత మావోయిస్టు పార్టీలో పనిచేసి ప్రస్తుతం వారికి సానుభూతిపరుడిగా వ్యవహరిస్తున్న వ్యక్తిని మంగళవారం అరెస్ట్ చేసినట్లు కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. వివరాలను కాటారం పోలీస్‌స్టేషన్‌లో వెల్లడించారు. పెద్దపల్లి జిల్లా నందిమేడారం గ్రామానికి చెందిన పొలం రాజయ్య ప్రస్తుతం ధర్మారంలో మిషన్ భగీరథ హెల్పర్‌గా పని చేస్తున్నాడు. గతంలో పెద్దపల్లిదళం, తదితర దళాల్లో పనిచేశాడు. కరీంనగర్ జిల్లాకు సంబంధించి ప్రొటెక్షన్ ప్లాటూన్‌లో ముఖ్యమైన మావో నేతలకు రక్షణ కల్పిస్తూ వివిధ ప్రాంతాలకు తరలించడంలో రాజయ్య కీలక దళ సభ్యుడిగా పని చేసేవాడు. ఆ సమయంలో ప్రస్తుత మావోయిస్టు రాష్ట్ర కార్యదర్శి కంకణాల రాజిరెడ్డి అలియాస్ వెంకటేశ్‌తో పరిచయం ఏర్పడింది. కాగా, 2002లో లొంగిపోయిన రాజయ్య ప్రభుత్వం ఇచ్చిన భూమిలో ఇల్లు కట్టుకుని వ్యవసాయం చేస్తున్నాడు. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. అంతలోనే నాలుగు నెలల క్రితం కంకణాల రాజిరెడ్డి రాజయ్యకు ఫోన్ చేసి పరిస్థితులపై ఆరా తీశాడు. ఈ క్రమంలో తిరిగి మావోల కోసం పని చేస్తానని రాజయ్య చెప్పాడు. దీంతో మావోయిస్టు రాజిరెడ్డి ఆదేశాల మేరకు నూతన రిక్రూట్‌మెంట్ కోసం యువతలో విప్లవ భావాలు నింపి ఆకర్షితులను చేసే పనిలో పడ్డాడు. ఇందులో భాగంగా తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో ఉన్న కంకణాల రాజిరెడ్డిని కలవడానికి విప్లవ సాహిత్యం, పేలుడు పదార్థాలు తీసుకుని కాటారం మీదుగా బైక్‌పై వెళ్తున్నాడు. బొప్పారం క్రాస్ వద్ద పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేయగా ఎస్సై–2 సుధాకర్, సిబ్బంది వెంబడించి పట్టుకుని విచారించారు. రాజయ్య నుంచి విప్లవ సాహిత్యం, కరపత్రాలు, మందుగుండు సామగ్రి కలిగిన నాలుగు జిలెటిన్ స్టిక్స్, నాలుగు డిటోనేటర్లు, ఫోన్, బైక్ స్వాధీనం చేసుకున్నారు. మావోయిస్టు సానుభూతిపరుడిని అరెస్ట్ చేసి వివరాలు సేకరించిన సీఐ రంజిత్‌రావు, ఎస్సైలు శ్రీనివాస్, సుధాకర్, రమేశ్‌లను డీఎస్పీ అభినందించారు. సమావేశంలో సీఐ రంజిత్‌రావు, సీఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ రమణారెడ్డి, ఎస్సైలు శ్రీనివాస్, సుధాకర్, రమేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

మందు పిచికారీ చేస్తే మాడిపోయిన మిర్చి పంట



పిచికారీ చేసిన మందు డబ్బాలను చూపుతున్న రైతు ఈర్య

చెన్నారావుపేట: మిర్చి చేనుకు పురుగు మందులు పిచికారీ చేస్తే మొక్కలు మాడిపోయిన ఘటన వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం పుల్లయ్యబోడుతండా శివారు లింగ్యాతండాలో మంగళవారం ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాలిలా ఉన్నాయి. తండాకు చెందిన భూక్య ఈర్య ఎకరం భూమిలో తేజ రకం మిర్చి సాగు చేశాడు. పంటకు తెగుళ్లు ఆశించడంతో ఈ నెల 19న పాపయ్యపేటలోని సరస్వతి ఫర్టిలైజర్ షాపు యజమాని లింగాల సూరయ్య వద్దకు వెళ్లి పురుగు మందులు కొనుగోలు చేసి పిచికారీ చేశాడు. మరుసటి ఉదయం వెళ్లి చూసేసరికి పంట మొత్తం మాడిపోయి కనిపించింది. దీంతో షాపు యజమాని సూరయ్య వద్దకు వెళ్లి ప్రశ్నించగా పట్టించుకోవడం లేదు. వ్యవసాయశాఖ అధికారులు పంటను పరిశీలించి న్యాయం చేయాలని ఈర్య వేడుకుంటున్నాడు. ఈ విషయమై ఏఓను వివరణ కోరగా పంటను పరిశీలిస్తామని తెలిపారు.



సీసా గలాటా.. పంటకు రక్షణ



పక్షుల బారి నుంచి పంటలను రక్షించుకునేందుకు రైతులు వినూత్న ఆలోచనలు చేస్తున్నారు. మహబూబాబాద్ జిల్లా అమనగల్ గ్రామ శివారులో రైతులు తాము సాగు చేస్తున్న పచ్చజొన్న, మొక్కజొన్న పంటలను కాపాడుకునేందుకు సమీప ప్రాంతంలో గల చెట్లకు మద్యం సీసాలకు రాళ్లను జోడించి ఏర్పాటు చేశారు. ఏ మాత్రం కొద్ది మేరలో గాలి వీచినా మద్యం సీసాకు కట్టిన రాయి దానికి తగులుతూ శబ్దం వస్తుంది. ఈ శబ్దంతో పక్షులు ఆ పంట చేలపై పడి తినకుండా కాడుకోగలుగుతున్నామని రైతులు తెలిపారు.

– మహబూబాబాద్ రూరల్

సోలార్ యూనిట్ ఏర్పాటుతో బిల్లులు తగ్గుతాయి

- టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ ఎ.గోపాల్‌రావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గోపాల్‌రావు

హన్మకొండ: సౌర విద్యుత్ ఉత్పత్తి చేసుకోవడం ద్వారా విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించుకోవచ్చని.. అదనపు చార్జీల సమస్య రాదని ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్‌రావు అన్నారు. ఏసీడీ, డెవలప్‌మెంట్ చార్జీలు చెల్లించని వారు విద్యుత్ సర్వీస్ తొలగించుకోవాల్సిందేనా అని విలేకరులు అడిగిన ప్రశ్నకు సీఎండీ పైవిధంగా స్పందిస్తూ సోలార్ యూనిట్ ఏర్పాటు చేసుకోవాలని సలహా ఇచ్చారు. మంగళవారం హనుమకొండ నక్కలగుట్టలోని టీఎస్ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిబంధనల మేరకు విద్యుత్ వినియోగదారులు డిపాజిట్ చెల్లించాల్సిందేనని, విద్యుత్ సర్వీస్ తీసుకున్నప్పుడు చేసుకునే అగ్రిమెంట్‌లో నిబంధనలు స్పష్టంగా ఉన్నాయని వివరించారు. తమకు వినియోగదారులు శత్రువులు కాదని, ఏసీడీపై విమర్శలు వస్తున్న నేపథ్యంలో స్పందించాల్సి వచ్చిందన్నారు. విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ నిబంధన-6 ప్రకారం ఏసీడీ విధిస్తున్నామని, ఏసీడీపై సందేహాలుంటే ఈఆర్‌ఓ వద్దకు వెళ్లి నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థలో 7,16,000 మంది వినియోగదారులు రూ.305 కోట్ల బకాయిలున్నారని వివరించారు. ఇలాంటి రాని బకాయిలతో సంస్థకు ఆర్థిక ఇబ్బందులు వస్తున్నాయన్నారు. వీటిని నివారించడానికి విద్యుత్ నియంత్రణ మండలి ఆదేశాల మేరకు అదనపు సెక్యూరిటీ డిపాజిట్ వసూలు చేస్తున్నామని తెలిపారు. బకాయిల చెల్లింపునకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ అవకాశం విద్యుత్ సంస్థల్లో లేదని స్పష్టం చేశారు. సమావేశంలో డైరెక్టర్లు బి.వెంకటేశ్వర్ రావు, పి.గణపతి, పి.సంధ్యారాణి, వి.తిరుపతి రెడ్డి, సీజీఎం మదుసూదన్, డీఈ(ఐటీ) అనిల్ కుమార్ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు లేకుండా తీర్చిదిద్దాలి

గ్రామాలను విద్యుత్ సమస్యలు లేకుండా తీర్చిదిద్దాలని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్‌రావు అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం నక్కలగుట్టలోని క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల ఎస్ఈలు, డీఈలు, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్స్‌తో సమీక్ష నిర్వహించారు. జిల్లాలు, డివిజన్లు, విభాగాల వారీగా ప్రగతిని సమీక్షించారు. దత్తత గ్రామాల్లో కాలిపోయిన, పని చేయని మీటర్లు ఉండకూడదని.. డిజిటల్ పేమెంట్స్‌ను ప్రోత్సహించాలని ఆదేశించారు. డైరెక్టర్లు బి. వెంకటేశ్వర రావు, పి.గణపతి, పి.సంధ్యారాణి, వి. తిరుపతిరెడ్డి, సీజీఎంలు అశోక్‌కుమార్, టి.మధుసూదన్, రాజుచౌహాన్, నిజామాబాద్ ఎస్ఈ రవీందర్, కామారెడ్డి ఎస్ఈ రమేష్, డీఈ(ఐటీ) అనిల్ కుమార్ పాల్గొన్నారు.

వేధింపులు తాళలేక మహిళ ఆత్మహత్య

ఏటూరునాగారం: అత్తామామ, మరిది, ఆడబిడ్డ వేధింపులు తాళలేక మహిళ ఆత్మహత్య చేసుకుంది. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం షాపెల్లికి చెందిన కుక్కల కిరణ్– కవిత(28)కు పదేళ్ల క్రితం వివాహం జరిగింది. అప్పటి నుంచి సంతానం కలుగలేదు. దీంతో మనస్తాపానికి గురైన కిరణ్ రెండు నెలల క్రితం ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటి నుంచి అత్తామామలు సుగుణ, మణెయ్య, మరిది రాజు, ఆడబిడ్డ లింగాల సుజాత కవితను వేధిస్తున్నారు. దీంతో మనస్తాపానికి గురై ఈనెల 22వ తేదీ తెల్లవారుజామున పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కవిత సోమవారం రాత్రి మృతి చెందింది. మృతురాలి తల్లి తుర్రి సునంద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేష్ తెలిపారు.

ఉపాధ్యాయురాలు దేవిక సస్పెన్షన్

కాశోజీ సెంటర్/రాయపర్తి: వరంగల్ జిల్లా రాయపర్తి మండలం కొత్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయురాలు(స్కూల్ అసిస్టెంట్) అంబటి దేవికను సస్పెండ్ చేసినట్లు డీఈఓ వాసంతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవిక ఈ నెల 20న కారణం లేకుండా 7వ తరగతి విద్యార్థులను కొట్టడంతో తీవ్ర గాయాలైనట్లు పాఠశాల హెచ్‌ఎం, ఇతర సిబ్బంది లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారని, విచారణ అనంతరం ఆమెను సస్పెండ్ చేసినట్లు డీఈఓ పేర్కొన్నారు. అలాగే, నెక్కొండ మండలం వెంకటాపూర్ ఎంపీపీఎస్ పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయుడు(ఎస్‌జీటీ) ఎం.వీరన్న పనివేళల్లో నిద్రిస్తున్నాడని పత్రికల్లో రావడంతో షోకాజ్ నోటీస్ జారీ చేసినట్లు తెలిపారు.

ఉద్యోగ నిర్వహణలో నైపుణ్యం ప్రదర్శించాలి



విద్యార్థులకు కిట్లు అందజేస్తున్న ఆర్జేడీ ఝాన్సీలక్ష్మీబాయి

మడికొండ: శిక్షణలో నేర్చుకున్న నైపుణ్యాన్ని ఉద్యోగ నిర్వహణలో ఆచరించాలని మహిళా శిశు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆర్జేడీ ఝాన్సీలక్ష్మీబాయి అన్నారు. బాలికల దినోత్సవం సందర్భంగా.. మడికొండ శివారు దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రంలో డీడీయూ–జీకేవై ఆధ్వర్యంలో (యంపీహెచ్‌డబ్ల్యూ) శిక్షణ పొందుతున్న విద్యార్థినులతో జాతీయ ప్రాంగణం జిల్లా మేనేజర్ జయశ్రీ ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ చేయించారు. శిక్షణ పొందుతున్న విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. మీలో ఓర్పు, సహనంతో అందరికీ సేవ చేయాలని సూచించారు. ఈసందర్భంగా విద్యార్థులకు కిట్లు అందించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ప్రాంగణ సిబ్బంది పాల్గొన్నారు.